
ప్రజాశక్తి
గురువారం 24 జులై 2025



వీరఘట్టంలో కుండపోత వర్షం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ కాసింది. ఒక్కసారిగా వాతావరణం మారి, భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా రహదారులు, కాలువలు, పంట పొలాలు, నీటితో దర్శనమిచ్చాయి.

సీతంపేట : సీతంపేట ఏజెన్సీలో బుధవారం కొద్దిపాటి వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వర్షాలు కురిసినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం లేదు. దీంతో వరి నాట్లు కూడా వేయలేదు. ఇప్పటికే ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం కొద్దిపాటి వర్షం కురవడంతో ఊరట లభించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో

తగ్గిన ప్రవేశాలు

- ప్రైవేటు బడులకు పెరుగుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ విధానాలే కారణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తరగతి గదిలో అరకొరగా ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతోంది. అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ బడులకు బారులు తీరుతున్నారంటూ ప్రభుత్వ పెద్దలు, అధికారులు చెబుతున్న ప్రచారానికి భిన్నమైన పరిస్థితి క్షేత్రస్థాయిలో కనపడుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు ఒకటో తరగతిలో చేరిన వారు కేవలం 6921 మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చేరారు. గత ఏడాది ఇదే సమయానికి 7459 మంది చేరారు. దీనంతటికీ ప్రభుత్వ విధానాలే కారణంగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో గతంలో ఏటా సుమారు 30వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారు. ఇటీవల కాలంలో ఏటా ఈ సంఖ్య తగ్గుతూ వస్తోంది. బడి మధ్యలో మానేసిన వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తుంది. గత ఏడాది కంటే ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లో చేరిన వారి సంఖ్య ఈ ఏడాది బాగా పెరిగింది. ప్రైవేటు పాఠశాలల్లో 18152 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం చేరారు. దీనంతటికీ ప్రభుత్వ విధానాలే కారణంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో ఉన్న 1717 ప్రభుత్వ పాఠశాలల్లో 1 వ తరగతి నుంచి పదో తరగతి వరకు 1,16,799 మంది ఉంటే 500 పైగా ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో 2,12,926 మంది విద్యార్థులు ఉన్నారు.

గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న విద్యాసంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలల విలీనం వల్ల గ్రామాల్లో చాలా చోట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. 3, 4, 5 తరగతులను కిలోమీటర్ల అవతల ఉన్న పాఠశాలలకు పంపడం వల్ల అక్కడ 1, 2 తరగతులే మిగులుతున్నాయి. దీంతో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్య 10 నుంచి 15 లోపే ఉండటంతో అవి ఏకోపా ధ్యాయ పాఠశాలలుగా మారుతున్నాయి. దీంతో పాఠశాలలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. మరోపక్క అమ్మఒడి, తల్లికి వందనం పథకాలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కూడా అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అమాంతంగా పడిపోతోంది. ఆ డబ్బులతో ప్రైవేటు పాఠశాలల్లో చదివించు కోవచ్చనే భావన తల్లిదండ్రుల్లో ఏర్పడుతోంది. మరోవైపు రాష్ట్రప్రభుత్వం 9 రకాల పాఠశాలల విధానం పెట్టడంతో తరగతుల విలీనం కావడంతో దూరంగా ఉన్న పాఠశాలలకు తల్లిదండ్రులు పంపలేక పోతున్నారు. ఈ విద్యార్థులను ప్రైవేట్ యాజమాన్యాలు బస్సు పెట్టి మరీ తమ పాఠశాలల్లో చేర్చుకుంటున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. ఇంకోవైపు మండల కేంద్రాల్లో హాస్టళ్లలో ఉంటూ హైస్కూళ్లలో విద్యార్థులు చదువుకుంటున్నారు. పలుచోట్ల వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో ఉండలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు మానేసి తమ గ్రామాలకు దగ్గరలోగల ప్రైవేటు స్కూళ్లలో చేరుతున్నారు.

విజయనగరం జిల్లాలో మండలాల వారీగా ఈ ఏడాది పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య

మండలం	ప్రభుత్వ	ప్రైవేటు
బాడంగి	146	86
భోగాపురం	312	277
బొబ్బిలి	370	1018
బొండపల్లి	264	212
చీపురుపల్లి	299	315
దత్తిరాజేరు	159	110
డెంకాడ	215	416
గజపతినగరం	174	294
గంట్యాడ	200	260
గరివిడి	311	294
గుర్ల	303	103
జామి	183	288
కొత్తవలస	187	629
ఎల్ కోట	160	126
మెంటాడ	223	83
మెరకముడిదాం	217	173
నెల్లిమర్ల	250	486
పూసపాటిరేగ	378	620
అర్.ఆమదాలవలస	325	30
రాజాం	265	989
అర్ బి పురం	271	144
సంతకవిటి	269	166
ఎస్. కోట	243	631
తెర్లాం	235	214
వంగర	130	37
వేపాడ	171	58
విజయనగరం	660	3153
మొత్తం	**6921**	**18152**

భారీ వర్షాల పట్ల అప్రమత్తం

- ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు వాటిల్లకూడదు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

అల్పపీడన ద్రోణితో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా, మండల అధికారులతో క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదుల్లో నీటిమట్టం తగినంత స్థాయిలో ఉన్నప్పటికీ ఈ నెల 24, 25 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నీటిమట్టం మరింత పెరగనుందని తెలిపారు. ఈ సందర్భంలో లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లో టామ్‌టామ్ వేయించడం, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ముఖ్యంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం, పశువులను కడగడం, ఇసుకను తవ్వడం వంటి పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, పోలీస్ సిబ్బంది సమన్వయం చేసుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసి, ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని సూచించారు. పొలాల్లో నారుమళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ఎటువంటి పంట నష్టం జరగకుండా ఇసుక బస్తాలు, మట్టి పోయడం వంటి ముందస్తు ఏర్పాట్లను చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలతో జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగరాదని కలెక్టర్ తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తగు సూచనలు, ఆదేశాలు జారీచేసిందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఒడిశాలో భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో వర్షాలు కురవక పోయినప్పటికీ, నదుల్లో నీటిమట్టం పెరిగి వరదలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ – 08963 293046 ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురం, పాలకొండ రెవిన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. తహశీల్దార్లు, విఆర్ఒలు, సిబ్బంది ప్రధాన కేంద్రాలను విడిచి వెళ్లరాదని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరూ ఉండరాదని, అవసరమైన మేరకు పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. గిరి శిఖర గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించి, వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రసవ సమయం దగ్గరలో ఉన్న గర్భిణులను గర్భిణుల వసతిగృహానికి, ఆస్పత్రులకు తరలించాలని ఆయన ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, ఆనకట్టలు తనిఖీ చేయాలని, 24 గంటలూ సిబ్బంది అప్రమత్తం కావాలని సూచించారు. గేట్లు, లాకులు తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేటట్లు చూడాలని, అవుట్ ఫ్లో సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్లు, జిల్లా, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఎఎన్ఎంలను నియమించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతిగృహాల్లో వైద్య సిబ్బంది(ఎఎన్ఎంలు)ని నియమిస్తామని మంత్రి సంధ్యారాణి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం మూడో రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా డే కోసం ఖర్చు చేసిన డబ్బుతో ఎఎన్ఎంలను నియమించి పదేళ్ల గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు చందు, ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది శ్రీరంజని, రజిని, గౌరిశ్వరి, స్వాతి, సృజన, శ్యామల, చిన్నమ్మి, కాంతమ్మ, జయమ్మ, విజయ, అంజలి, నందిని పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునప్రారంభించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సంక్షేమ బోర్డుకు చైర్మన్‌ను నియమించినా, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. వెంటనే సంక్షేమ బోర్డుకు పాలక మండలిని ఏర్పాటు చేసి, బోర్డు పూర్తి స్థాయిలో పనిచేసేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సింహాద్రి, దుర్గారావు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి స్ఫూర్తి అచ్యుతానందన్



అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

విఎస్ సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్

ప్రజాశక్తి-పార్వతీపురం

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో పూర్వ సభ్యులు విఎస్ అచ్యుతానందన్ జీవిత కాలం విప్లవానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి స్ఫూర్తి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా, పట్టణ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు.. అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొదటగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు వి.ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో అశోక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా అచ్యుతానందన్ పాలనలో కేరళ ప్రజల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టారని చెప్పారు. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలక ఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేతని కొనియాడారు. కార్మిక ఉద్యమం నుంచి వచ్చిన ప్రజానేతని అన్నారు. పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువును ఆపేసి దర్జీ దుకాణంలో కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో పని చేస్తూ జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలోకి అడుగు పెట్టారన్నారు. కేరళ రాష్ట్రంలో భూ ఆక్రమణ దారులపై ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉక్కుపాదం మోపారన్నారు. ప్రజల్లో మంచి పేరున్న నాయకులని, నిరాడంబర జీవి, సామాజిక న్యాయానికి కట్టుబడిన వ్యక్తని తెలిపారు. ఆయన మృతి పార్టీ ఉద్యమానికి, ప్రజలకు తీరని నష్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, గిరిజన సంఘం, జిల్లా, పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, ఎం. తిరుపతిరావు, కె.రామస్వామి, బి.వి.రమణ, బి.సూరిబాబు, ఎం.రమణ, బి.లక్ష్మీ, ఎం.సీతారాం, ఎం.శ్రీను, పి.మోహన్, ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : సీతానగరంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అచ్యుతానందన్ మరణం ప్రజాస్వామ్యానికి, ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, విఎస్ ఆశయ సాధనకు పోరాడాలని రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి ఈశ్వరరావు, జి, వెంకటరమణ, ఆర్.రాము, ప్రజాసంఘాలు నాయకులు పాల్గొన్నారు.



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు, తదితరులు



నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.రాజు, ఉపాధ్యక్షులు కె.డేవిడ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నప్పటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించక పోవడం చాలా అన్యాయమన్నారు. డిగ్రీ అడ్మిషన్లు సకాలంలో చేపట్టకపోవడంతో విద్యార్థులంతా విద్యకు దూరమై, వలస కూలీలుగా వెళ్ళిపోయే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు.

అనేక చెడు వ్యసనాలకు గురవుతారని తెలిపారు. వెంటనే అడ్మిషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హెచ్.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు జి సురేష్, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో విచారణ

ప్రజాశక్తి-కురుపాం

కురుపాం ఏకలవ్య పాఠశాలలో గిరిజన సంక్షేమ డిప్యూటీ డిఇఒ జ్ఞానప్రకాశ్ బుధవారం విచారణ చేపట్టారు. ఆ పాఠశాలలో విద్యార్థులను పిఇటి చితకబాదుతున్నట్లుగా సోషల్ మీడియాలో కథనాలు రావడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలను సందర్శించారు. పిఇటిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం ఐటిడిఎ పిఒ ఆదేశాలతో గిరిజన సంక్షేమ డిప్యూటీ డిఇఒ జ్ఞాన ప్రకాశ్ విద్యార్థులతో ఏకాంతంగా మాట్లాడుతూ వివరాలు సేకరించారు. దర్యాప్తులో కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేశ్వరరావు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న డిప్యూటీ డిఇఒ జ్ఞానప్రకాశ్

పూర్తిస్థాయిలో యూరియా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని 24 రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా పూర్తిస్థాయిలో యూరియా పంపిణీ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎన్.సింహాచలం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలకు రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారని తెలిపారు. ఇప్పటికీ చిన్నగొర రైతు సేవా కేంద్రానికి యూరియా సరఫరా కాకపోవడంతో గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

పక్కాగా ఫీవర్ సర్వే

- డిఎంహెచ్ఒ భాస్కరరావు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-మక్కువ

సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి, జ్వర లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. దబ్బగెడ్డలో జ్వరాలపై బుధవారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. క్షేత్ర స్థాయిలో జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయని పరిశీలించేందుకు మండలంలో దబ్బగెడ్డ గ్రామంలో బుధవారం పర్యటించారు. ముందుగా గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. గ్రామస్తులకు నిర్వహించిన వైద్య పరీక్షలు, జ్వర లక్షణాలతో ఎంత మంది ఉన్నారు, అందజేసిన చికిత్స వివరాలు తెలుసుకున్నారు. గృహ సందర్శనలు చేసి గ్రామంలో సీజనల్ వ్యాధుల ప్రభావం ఏ మేరకు ఉందో పరిశీలించారు. ఫ్రైడే డ్రైడే, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరు, తాగునీటి స్వచ్ఛత పరీక్షల నివేదికలు గమనించారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామంలో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతిరోజూ ఫీవర్ సర్వే చేపట్టి నివేదికకు అందజేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. అనంతరం మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, ఒపి వివరాల రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వైద్యం దృష్ట్యా రోగులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్, జిల్లా మలేరియా అధికారి వై.మణి, వైద్యాధికారులు చంద్రశేఖర్, శివాజీ, ఎంఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఉన్నట్టా? లేనట్టా?

ప్రజాశక్తి-కొమరాడ

విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న పాఠశాలలకు, ఒక్కో విద్యార్థి ఉన్న బడులకు ఉపాధ్యాయులను పంపిస్తున్న ప్రభుత్వం... గిరిజన విద్యపై మాత్రం నిర్లక్ష్య ధోరణిని కొనసాగిస్తోంది. గిరిజన గ్రామాల్లో అనేక పాఠశాలలకు ఉపాధ్యాయులు పంపించకపోవడంతో ఆదివాసీ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. మండలంలోని పాలెం పంచాయతీ కుస్తూరుతోపాటు కొన, వనబడి జిపిఎస్ పాఠశాలలకు ఉపాధ్యాయులు లేరు. కుస్తూరులో పాఠశాలకు గత తొమ్మిది నెలలుగా ఉపాధ్యాయులు లేరని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇక్కడ 8 మంది విద్యార్థులున్నా, ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యకు దూరమయ్యారు. ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉన్న జిపిఎస్ పాఠశాలకు ఉపాధ్యాయులు హాజరవుతున్నారని చూపిస్తున్నారు. పాఠశాలలకు అసలు ఉపాధ్యాయులు రావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఇంతకూ ఉపాధ్యాయులు అక్కడ ఉన్నట్టా? లేనట్టా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అన్ని జిపిఎస్ పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు నియమించాలని సిపిఎం జిల్లా నాయకులు కె.సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.



ఉపాధ్యాయులు లేక కుస్తూరులో బడిబయట ఉన్న విద్యార్థులు



ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్న గిరిజనులు

స.హ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణవాయువు లాంటిదని జిల్లా సహకార అధికారి పి.శ్రీరామమూర్తి అన్నారు. జిల్లా సహకార అధికారి కార్యాలయంలో సహకార శాఖ అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత, సుపరిపాలన సౌలభ్యంగా ప్రజలకు అందేటట్లు ఉద్యోగులు పని చేయాలన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం తీరుపై ప్రజలు పరిపాలనా సమాచారాన్ని పొందే హక్కు కలిగి ఉండటం వల్ల ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం, బాధ్యత పెరుగుతుందన్నారు. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరునికి ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచారం గురించి విజ్ఞప్తి చేసే హక్కును కల్పించిందని, అది సమాజంలో బాధ్యతాయుత పాలనను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అవగాహన సదస్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను తెలుసుకొని, దాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సహకార శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -వీరఘట్టం

అల్పపీడన ప్రభావంతో నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, పరివాహక ప్రాంతాల విఆర్‌ఒలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు ఎఎస్ కామేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో విఆర్‌ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా గ్రామాల సందర్శించి నది నీటి ప్రవాహంపై అప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. రాత్రి సమయంలో ఎట్టి పరిస్థితుల్లో నది వద్దకు గ్రామస్తులు వెళ్లనీయకుండా చూడాలన్నారు. అవసరమైతే గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ డిటి జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఐటిఐ మిగులు సీట్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఐటిఐ మిగులు సీట్లకు ఈ నెల 27వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటిఐ ప్రిన్సిపల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

అగ్రిగోల్డ్ భూముల సర్వే

ప్రజాశక్తి-కొమరాడ

అగ్రిగోల్డ్ భూముల విలువ వివరాలతో నివేదికలు సమర్పించాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. సిఐడి, అటవీ శాఖ అధికారులతో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉలిపిరి పంచాయతీ పరిధిలో 46 ఎకరాలు, చోళ్లపదం పంచాయతీ పరిధిలో 29 ఎకరాలు అగ్రిగోల్డ్ భూములు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆ భూముల్లో ప్రస్తుతం అధికంగా టేకు ఉందని తెలిపారు. వాటి విలువ వివరాలన్నీ సేకరించేందుకు రెవెన్యూ సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది, ఫారెస్ట్ అధికారులు కలిసి సర్వే చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఫారెస్ట్ గాడ్ సత్యనారాయణ, రీ సర్వే డిటి పకీరు, సిఐడి ఎస్ఐ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి కొమరాడ

ఉపాధి బకాయిలు చెల్లించాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మూణ్నాలుగా నెలల బకాయిలు ఉన్నాయని, వెంటనే చెల్లించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి.శ్రీను నాయుడు డిమాండ్ చేశారు.

మక్కువ : ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన బుధవారం మక్కువ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపిడిఒకు వినతి అందించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, నాయకులు అసిరి, ప్రసాద్ పాల్గొన్నారు.

పాతబస్టాండ్‌లో చెత్త తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-వీరఘట్టం

మేజర్ పంచాయతీ పరిధిలోనే పాత బస్టాండ్‌లో బుధవారం జెసిబితో చెత్తను తొలగించారు. కానరాని పారిశుధ్య పక్షోత్సవాలు.. అనే శీర్షికతో బుధవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి మేజర్ పంచాయతీ ఇఒ కోటేశ్వరరావు స్పందించి, చెత్తను తొలగించారు. కాలువపై ఉన్న పలకలను కూడా తక్షణమే తొలగించాలని ఆక్రమణదారులను ఆదేశించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని గిరిజన గ్రామమైన అచ్చపువలసలో బుధవారం వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుభారతామని, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : బూర్జ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి టి.హేమాక్షి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కృష్ణరాయపురంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.అన్నంనాయుడు, ఆయుర్వేద వైద్య శాల సిబ్బంది పద్మ, పైడితల్లి పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బత్తిలిలోని రెల్లి వీధి, డిఎన్ఆర్ వీధిలో డాక్టర్ కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా 93 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని స్థానికులకు సూచించారు. ఇఒ నూక నాయుడు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి-సీతానగరం

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని సూరంపేట, గుచ్చిమి, జోగంపేటలో పి4 కార్యాచరణపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్థికంగానే కాకుండా విద్య, వైద్యం, తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి బంగారు కుటుంబాలకు తోడ్పాటు అందించేందుకు మార్గదర్శకులు తోడ్పాటు అందిస్తారని ఆయన వెల్లడించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి వర్మ, కార్యదర్శులు పిల్లి మురళి, లావణ్య పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని పెదగొత్తిలి పంచాయతీలో సర్పంచ్ లోకనాథం అధ్యక్షతన బుధవారం పి4 సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ సర్వే ముఖ్య ఉద్దేశం వివరించి, ప్రజలు అవసరాలను తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి చంటి పాల్గొన్నారు.

ప్లాస్టిక్, ఫోమ్ బోర్డులు నిషేధం

విజయనగరం టౌన్ : నగరంలో ప్లాస్టిక్, ఫోమ్ బోర్డులు వంటివి నిషేధించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. అనధికారికంగా ప్రతి ఇంటి గేటుకు అమర్చిన ప్లాస్టిక్ ప్రకటిత బోర్డులను కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది తొలగించారు. 41వ నెంబర్ సచివాలయ పరిధిలో ఇందు నిమిత్తం ప్రత్యేక పర్యవేక్షణతో ప్లాస్టిక్ బోర్డులను,ఫోమ్ బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పర్యావరణానికి విఘాతం కలిగించడంతో పాటు ఇళ్ళ యజమానులకు అసౌకర్యాన్ని కల్పిస్తూ ఇంటి ముందు గేట్లకు పలువురు ప్లాస్టిక్ బోర్డులను అతికిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే వాటిని అమర్చేందుకు ఇటు నగరపాలక సంస్థ అధికారుల అనుమతి గానీ, కనీసం ఇంటి యజమాని సమ్మతి గానీ తీసుకోకుండా ప్లాస్టిక్ బోర్డులను అతికిస్తున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు.

ఆదివాసీల ఆపద్బాంధవుడు

- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక ఫోకస్
- పది ఫలితాల్లో ఐటిడిఎ స్టేట్ ఫస్ట్
- గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో ముందడుగు
- పర్యాటక రంగం కొత్త పుంతలు
- సీతంపేట ఐటిడిఎపై పిఒ యశ్వంత్ మార్క్


ఎనీమియా పరీక్షల కోసం హాజరైన గిరిజనులు (ఫైల్)

సికిల్‌సెల్ ఎనీమియా.. ఏజెన్సీని పట్టిపీడిస్తున్న వ్యాధుల్లో ఇదొకటి. ఈ రోగం వల్ల రక్తహీనతతో గిరిజనుల్లో అల్లాడి పోయేవారు. కనీసం వ్యాధి నిర్ధారణకు పరీక్ష చేయించుకుందామన్నా విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు వెళ్లాల్సిందే. అమాయక గిరిజనులు.. ఏదోలా అంతదూరం వెళ్లినా, అక్కడ పట్టించుకుంటారన్న, సమయానికి పరీక్ష చేస్తారన్న గ్యారెంటీ లేదు. ఆర్థిక ఇబ్బందులతో పౌష్టికాహారానికి దూరమై మంచానికే పరిమితమై, చావుకు దగ్గరయ్యేవారు. అలాంటి ఎనీమియా బాధితుల పాలిట ఆపద్బాంధవుడయ్యారు... సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి. ఇదొక్కటే కాదు, ఆదివాసీలకు అండగా నిలుస్తూ, ఏజెన్సీల్లో అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కిస్తూ వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టిన సుమారు 10 నెలల కాలంలోనే సీతంపేట ఐటిడిఎపై తనదైన ముద్ర వేశారు.

ప్రజాశక్తి-సీతంపేట

గతేడాది సెప్టెంబర్‌లో పాలకొండ సబ్‌కలెక్టర్‌గా యువ ఐఎఎస్ అధికారి యశ్వంత్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. నాటి నుంచే సీతంపేట ఐటిడిఎకు ఇన్‌ఛార్జిగా ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. గాడితప్పిన ఐటిడిఎ పాలనను ప్రక్షాళన చేస్తూ పరిపాలనపై పట్టు సాధించారు. ఐటిడిఎ పరిధిలోని గిరిజన తండాలను చుట్టుముట్టిన సమస్యలపై దృష్టిసారించి, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వచ్చిన సమస్యలను పరిష్కారానికి వెనువెంటనే చర్యలు చేపడుతున్నారు.

1.24 లక్షల మందికి ఎనీమియా పరీక్షలు

గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే అరుదైన వ్యాధుల్లో సికిల్‌సెల్ ఎనీమియా ఒకటి. ఈ వ్యాధి బారిన పడినవారు రక్తం రోజురోజుకు తగ్గిపోవడం, ఉత్పత్తి లేకపోవడంతో నీరసించిపోతారు. ఈ వ్యాధికి సరైన చికిత్స విధానం లేకపోవడంతో చాలామంది మరణాలకు గురవుతున్నారని పిఒ యశ్వంత్ గుర్తించారు. ఈ వైద్యం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చవుతాయి. ఈ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం నెలకు రూ.10 వేల పింఛను అందిస్తుంది. ఈ పింఛను అందుకోవడానికి సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు కెజిహెచ్‌లో హెచ్‌బిఎల్‌సి పరీక్ష చేయించుకుని, పాజిటివ్ ధ్రువపత్రం పొందాలి. దీనిని అందుకోవాలంటే ఎన్నో ప్రయాసలు పడాలి. ఈ ధ్రువపత్రాల కోసం క్షేత్రస్థాయిలో గిరిజనుల కష్టాలను పరిశీలించిన పిఒ.. గిరిజనులు కెజిహెచ్‌కి వెళ్లినా పట్టించుకోరనే ఉద్దేశంతో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కెజిహెచ్‌లో నిర్వహించే పరీక్షను సీతంపేట వైటిసిలో నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాలు, ఆశ్రమ పాఠశాలలో 40 ఏళ్లలోపు వయస్సు కలిగిన 1.24 లక్షల మందికి గతేడాది డిసెంబర్ 3న కెజిహెచ్ బృందంతో ఎనీమియా పరీక్షలు చేయించారు. వీరిలో 110 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వారికి ధ్రువపత్రాలు జారీ చేశారు. అనంతరం వారికి పిహెచ్‌సిల వైద్యాధికారులను ఐటిడిఎ పిఒ అప్రమత్తం చేసి, పింఛన్ల మంజూరు కోసం అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఐటిడిఎకు చేరిన దరఖాస్తులను పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయాలకు పంపించి, కొత్త పింఛన్లు మంజూరయ్యే సరికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అటవీ ఉత్పత్తులకు మార్కెట్ ధర

గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తులు జీడి, పైనాపిల్, కొండచీపుర్లకు మార్కెట్ ధర కల్పించేందుకు ఐటిడిఎ పరిధిలో 121 వన్‌ధన్ వికాస్ కేంద్రాలను ఐటిడిఎ పిఒ నెలకొల్పారు. పార్వతీపురం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం రైతుబజార్లలో షాపులు కూడా పైనాపిల్ వంటివి విక్రయించడానికి నెలకొల్పారు.

వైటిసిలో గర్భిణుల హాస్టల్

సీతంపేట వైటిసిలో గర్భిణుల హాస్టల్‌ను పిఒ యశ్వంత్ ఏర్పాటుచేశారు. తల్లిబిడ్డలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా రెండు నెలల ముందే గర్భిణుల హాస్టల్లో ప్రవేశాలు కల్పిస్తారు. గైనకాలజిస్ట్ పర్యవేక్షణలో ఉంటారు. ఇంటి వద్ద ప్రసవాలు లేకుండా చూస్తున్నారు. అంతేకాకుండా ఎత్తయిన కొండలపై ఉన్న అంబులెన్స్ వెళ్లని గిరిజన తండాల గర్భిణులను కూడా ఇక్కడ చేర్పించి, వైద్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు.

విద్యార్థుల జ్వరాలపై ఆరా

ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో విద్యార్థులకు జ్వరాలు వచ్చిన వెంటనే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించి తగ్గినంతవరకు బాధ్యతలు తీసుకోవాలని 14 మంది దత్తత అధికారులను పిఒ నియమించారు. ఒక్కొక్క అధికారికి ఐదు పాఠశాలలను చొప్పున అప్పగించారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని పాఠశాలల కిటికీలు దోమలు రాకుండా మెస్‌లు అమర్చారు. ఏజెన్సీలో జ్వరాలు ఉన్నప్పటికీ దాన్ని తగ్గు ముఖం పట్టే విధంగా ప్రణాళికలు రూపొందించి, సమావేశాలు నిర్వహించి వైద్యులను అప్రమత్తం చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, అంబులెన్స్, మందులు ఉండే విధంగా చర్యలు చేపట్టారు.


ఎనీమియా పరీక్షల శిబిరాన్ని పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్

గిరిజన విద్యపై ప్రత్యేక ఫోకస్

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని పాఠశాలలను ఐటిడిఎ పిఒ యశ్వంత్ సందర్శించి విద్యార్థులు కావలసిన మౌలిక వసతులు కల్పించారు. ఆశ్రమ పాఠశాలలకు మరమ్మతులు చేపట్టారు. విద్యార్థులతో ముచ్చటించి, బాగోగులు తెలుసుకునే వారు. హౌస్ పోటీలకు శ్రీకారం చుట్టి, విద్యార్థుల్లో బిడియం పోగొట్టారు. వారి బంగారు భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేయించారు. విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. పిఒ చర్యలతో రాష్ట్రంలోని సీతంపేట ఐటిడిఎ పదో తరగతిలో ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. హడ్డుబంగి గిరిజన ఆశ్రమ పాఠశాల రాష్ట్రంలో మొదటి స్థానం సాధించి, ఆదర్శంగా నిలిచింది. 23 పాఠశాలలకు అదనపు భవనాలు కావాలని ఒక్కొక్క భవనానికి రూ.ఐదు కోట్లు చొప్పున ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. కార్పొరేట్ పాఠశాల తరహాలో ఉపాధ్యాయులను గ్రామాలకు పంపించి అడ్మిషన్ల సంఖ్య పెంచేలా కృషి చేశారు. డ్రాపౌట్లను తగ్గించారు.


ఆడలి వ్యూపాయింట్ వద్ద కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే జయకృష్ణతో పిఒ

పర్యాటకం పరుగులు

సీతంపేట ఏజెన్సీ పర్యాటకంగా కొత్త సొబగులు సంతరించుకుంది. పర్యాటక పనులను పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి పరుగులు తీయించారు. ఆడలివ్యూ పాయింట్‌ను అధునాతన హంగులతో పనులు త్వరగా చేపట్టి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రమాదాలను నివారించడానికి ఘాట్ రోడ్డు మలుపుల వద్ద రక్షణగోడ ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు వద్ద నూతనంగా స్విమ్మింగ్ పూల్, రెయిన్ డాన్స్, వాటర్ స్పోర్ట్స్ క్రీడల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అడ్వెంచర్ పార్కులో గిరి గ్రామదర్శిని గ్రామం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీ పురం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. మండలంలో గొయ్యిపాక పంచాయతీలో రసాబడి, టంకు, కితలాంబ గ్రామాల్లో బుధవారం టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నామని అన్నారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కూడా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, సర్పంచ్ కేరంగి లక్ష్మీ, నాయకులు పాడి సుదర్శన్ రావు, భారతమ్మ, సింహాచలం, లక్ష్మణరావు, దాసు, ధర్మరావు, కోటి, వెంకటరావు, కృష్ణ, రంజిత్, బుజ్జేశ్వరరావు, పురుషోత్తం, సీతారాం, అనిబాబు, అనిల్, ప్రసాదరావు, సుందర్ రావు, రమేష్, శరత్ కుమార్, ప్రభాకర్ రావు, సామూర్తి, బూత్ కన్వీనర్ అనీష్, రాజేష్, పెంటయ్య, కామేష్, శ్రీను పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం : మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం నిలబడి పని చేస్తోందని టిడిపి మండల కన్వీనర్ కెవికొండయ్య అన్నారు. బుధవారం కురుపాంలోని ముస్లిం వీధిలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, నాయకులు కర్రి శ్రీను, బలగ రామక్రిష్ణ, సాధుల్లా బాషా, సాయి, ఫిరోజ్, సురేష్, గోవిందా, మురళి, గవరయ్య పాల్గొన్నారు.

పాచిపెంట : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి మండల అధ్యక్షులు గూడెపు యుగంధర్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దవలస, కర్రివలస, పద్మాపురం పంచాయతీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ, చల్లా కనక, కొత్తల పోలినాయుడు, ఎం.బలరాం, కె.సురేష్, పూసర్ల నర్సింగరావు, మాదిరెడ్డి మధ్యరావు, అలజంగి సీతారాం పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వేయించి బియ్యం హాంఫట్

తహశీల్దార్‌కి వృద్ధురాలి ఫిర్యాదు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని 11వ నెంబరు రేషన్ డిపో పరిధిలో ఉన్న ఓ నిరుపేద వృద్ధురాలి బయోమెట్రిక్ వేయించి బియ్యం పంపిణీ చేయని డీలర్ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెలలో గొట్టాపువీధికి చెందిన ఏగిరెడ్డి సింహాచలం అనే వృద్ధురాలు ఇంటికి రేషన్ డీలర్ సంధ్యారాణి వెళ్లి బయోమెట్రిక్ వేయించారు. 65 సంవత్సరాల వయసు దాటిన వృద్ధుల ఇళ్ళకు వెళ్ళి బయోమెట్రిక్ వేయించి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రేషన్ డీలర్ సంధ్యారాణి వృద్ధురాలు సింహాచలం ఇంటికి వెళ్ళి బయోమెట్రిక్ వేయించిన తర్వాత బియ్యం ఇంటికి పంపిస్తానని చెప్పి పంపించలేదు. దీంతో ఆ వృద్ధురాలు సింహాచలం బుధవారం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆవరణలోని గాంధీ బొమ్మ వద్ద కూర్చున్నారు. అప్పుడే కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తహశీల్దార్ నీలకంఠరావు వృద్ధురాలిని ఎందుకు వచ్చావని ఆరా తీశారు. గత నెలలో బయోమెట్రిక్ వేయించిన డీలర్ సంధ్యారాణి బియ్యం పంపిణీ చేయలేదని ఆమె ఫిర్యాదు చేశారు. నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు బియ్యం పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వహించిన డీలర్ సంధ్యారాణిపై తహశీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ వృద్ధురాలికి బియ్యం పంపిణీ చేసేలా చూడాలని సిఎస్ డిటి కిరీటిని ఆదేశించారు. దీనిపై వృద్ధురాలు సింహాచలాన్ని ప్రజాశక్తి కదపగా, గత నెలలో బయోమెట్రిక్ వేయించుకుని 35 కిలోల బియ్యం పంపిణీ చేయలేదని, బియ్యానికి బదులు డబ్బులు ఇస్తానని డీలర్ సంధ్యారాణి చెప్పారని తెలిపారు. తనకు బియ్యం కావాలన్నానని చెప్పినట్లు ఆమె వివరించారు. ఈ సంఘటనని బట్టి పట్టణంలోని డీలర్లు వృద్ధులతో బయోమెట్రిక్ వేయించిన తర్వాత డబ్బులు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్పష్టమవుతోంది.


తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధురాలు


కృష్ణారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

పలువురికి శ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో జరడ పంచాయతీ మాజీ సర్పంచ్ ఊయక కృష్ణారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించి ఓదార్చారు. అనంతరం జి.శివడ గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త నిమ్మల రాజారావు కూడా అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, వైస్ ఎంపిపి అన్నాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరఘట్టంలో ర్యాలీ

ప్రజాశక్తి-వీరఘట్టం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా గురువారం విడుదల కానున్న నేపథ్యంలో మండల కేంద్రంలో ర్యాలీ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జనసేన కార్యకర్తలు, అభిమానులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుండి ప్రధాన రహదారి మీదుగా బిఎంఆర్ థియేటర్ వరకు ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ కేక్ కట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, రాయి పళ్లి రత్నాకర్, జనసేన జానీ, ఎం.పుండరికం, ఎస్.అచ్యుతరావు, కె.సాయి పవన్, పండు, చరణ్ పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం

హామీల అమల్లో టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు విమర్శించారు. బుధవారం మండలంలోని చినబోగిలి గ్రామంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ సూపర్ సిక్స్ పథకాలలో ఏవీ అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, రైతు విభాగం నియోజక వర్గ అధ్యక్షులు ఆర్‌వి పార్థసారథి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ఎం.రామకృష్ణ, మండల నాయకులు ఎన్.గోపాలం, ఎం.ధనుంజయ నాయుడు, సర్పంచ్ కె. రాధా శ్రీనివాసరావు, ఎంపిటిసి బుజ్జి, బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్.తిరుపతి రావు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

నానో ఎరువులే కీలకం

ప్రజాశక్తి-పాచిపెంట

పోడు వ్యవసాయంలో బస్తా ఎరువుల కంటే నానో ఎరువులే బాగా పని చేస్తాయని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చిట్యాలబ, శతాబి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నానో ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అధిక యూరియా వేస్తే వానపాములు ఎంత త్వరగా చనిపోతున్నాయో ప్రత్యక్షంగా రైతులకు చూపించారు. కార్యక్రమంలో శతాబి సర్పంచి రామయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్, ఉమామహేశ్వరి, పంచాయతీ సెక్రటరీ ఉదయ్ కుమార్, మహిళా పోలీస్ కుమారి పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

ఎస్‌డబ్ల్యుపిసి సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో హడ్డుబంగిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిడిఒ బిబి మిశ్రా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరు చేయాలన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేస్తే మంచి ఆదాయం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కొండపల్లి సత్యం, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బొక్కుపేట పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. తాగునీటి ట్యాంకులను పరిశీలించి, బ్లీచింగ్ కలిపి నీరు సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సర్పంచ్ గొట్టాపు మంగమ్మ, మాజీ సర్పంచ్ గొట్టాపు అప్పారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో. ముత్యాలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.